క్లుప్తంగా

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం పట్టణంలోని 9వ వార్డులో తడి-పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అదికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు

మక్తల్: పట్టణంలో కేశవనగర్‌లోని శ్రీ కెంచమ్మ ఆలయంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే దండు గ్రామంలో మారేమ్మ దేవతకు పూజలు జరిపించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



మక్తల్: తమకు రావాల్సిన బకాయి వేతనాలను చెల్లించాలని మక్తల్ మున్సిపాలిటీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీయూసీఐ ఆధ్వర్యంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా టీయూసీఐ అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచి ప్రజలు రోగాల బారిన పడకుండ కాపాడే కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బండారి రవికుమార్, బాలు, రామలింగం, సుజాత, మహేశ్వరమ్మ, వెంకటేష్, ఆకాష్, మారుతి, మల్లేష్, శంరమ్మ, కృష్ణయ్య, మారెప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట



మరికల్: మండల నూతన తహసీల్దార్‌గా రాంకోటి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ కళావతమ్మతో పాటు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి, భగవంతు, భాస్కర్‌రెడ్డి, బీంరెడ్డిలు పాల్గొన్నారు.

కన్మనూర్‌లో యోగాపై అవగాహన

మరికల్: ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కన్మనూర్ గ్రామంలో మంగళవారం ఆయూష్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో యోగా వాక్ చేపట్టారు. ప్రజలు యోగాపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఈ నెల 21న యోగ దినోత్సవంలో అందరూ పాల్గొనాలని ఆయూష్ సిబ్బంది స్వేత, అనురాధ కోరారు.

మాగనూర్ తహసీల్దార్‌గా నాగలక్ష్మి



మాగనూర్: మండల నూతన తహసీల్దార్‌గా నాగలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో గండేడ్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా నారాయణపేట జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు.

రైతుకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి

- మండలంలో 27 రెవెన్యూ గ్రామాలు
- మొత్తం 19,908 మంది రైతులు
- ఇప్పటి వరకు 4126 దరఖాస్తుల నమోదు



ఫార్మర్ ఐడీ దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

దామరగిద్ద: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. అందకనుగుణంగా అన్నదాతలకు మరింత పారదర్శకంగా పథకాలనే చేరవేసేందుకు భూమిని కల్గి ఉన్న ప్రతి రైతన్నకు 14 అంకెలతో కూడిన గుర్తింపు నెంబర్‌ను అందించేందుకు చర్యలు చేపట్టింది. రెవెన్యు రికార్డుల ఆధారంగా పట్టాదారు పాస్‌బుక్‌తో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం మే 5న ప్రారంభించింది. ఆధార్‌ను పోలిన గుర్తింపును రైతులకు అందించి అదే గుర్తింపు కార్డు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలను అందించేందుకు ఫార్మర్ ఐడీని తప్పనిసరి చేయనుంది. ప్రతి రైతు తమ ఆధార్‌తో పాటు పట్టదారు పాస్‌బుక్, ఆధార్ లింక్డ్ ఫోన్ నెంబర్‌కు వచ్చే ఓటీపీల ఆధారంగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.



దరఖాస్తులను నమోదు చేస్తున్న అధికారి

మండలంలో 19,908 మంది రైతులు

మండలంలో 27 రెవెన్యు గ్రామాలు ఎనిమిది వ్యవసాయ క్లస్టర్‌గా విభజించారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో ఏఈఓలు క్షేత్ర స్థాయిలో రైతుల నుంచి సదరు ధ్రువపత్రాలను తీసుకొని దరఖాస్తు చేస్తున్నారు. మండలంలో మొత్తం 19,908 మంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలను కల్గి ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పటికి 4126 మంది రైతుల దరఖాస్తులను అధికారులు నమోదు చేశారు. మిగిలిన రైతులు ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉంది. రైతు వివరాల నమోదు, ఓటీపీ, సర్వర్ సమస్య వంటి కారణాలతో ఒక్కో ఏఈఓ రోజుకు 30 నుంచి 40 మంది రైతుల దరఖాస్తులను నమోదు చేస్తున్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు గుర్తింపు నెంబర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని లేని పక్షంలో రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

> **"రైతులు దరఖాస్తు చేసుకోవాలి"**
>
> 
>
> రైతులకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ అందించి తద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులకు మరింత పారదర్శకంగా అందించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పార్మర్ ఐడీని అందిస్తుంది. రైతులకు తప్పనిసరిగా పార్మర్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలి.
>
> – మణిచందర్, మండల వ్యవసాయ అధికారి, దామరగిద్ద

ఘనంగా పోలమ్మదేవి జాతర

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లి, ఎక్లాస్‌పూర్, బైరంకొండ, జాజాపూర్ గ్రామంలో మంగళవారం శ్రీపోలమ్మ దేవి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతి అందించి అంబలి నైవేద్యం సమర్పించారు. గ్రామ పురవీధుల గుండా మహిళలు పెద్దఎత్తున నెత్తిన బోణాలు పెట్టుకుని శోభయాత్ర ద్వారా గుట్టమీదకు తరలివచ్చి అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. వివి గ్రామాల నుంచి వచ్చిన యువకులు, పురుషులకు రెట్టాపట్లు నిర్వహించారు.



బైరంకొండలో బోనాలతో భారీగా తరలివచ్చిన మహిళలు



కొత్తపల్లిలో బోనాలతో వెళుతున్న మహిళలు

వైభవంగా పోషమ్మ బోనాలు

మద్దూరు, కొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, భూనీడు,దుప్పడి గట్టు గ్రామాల్లో పోషమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పలు వీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామ శివారులో వెలసిన పోషమ్మకు ప్రత్యేక నైవేద్యాలు, కోడి పుంజులతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి అక్రమ తరలింపును అడ్డుకోండి

ధన్వాడ: ఎ మండలంలో ఎర్రమట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని సీపీఐ నాయకులు తెలిపారు. గున్ముక్ల గుట్ట నుంచి మూడు నెలల నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ పార్టీ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ అన్నారు. గున్ముక్ల గ్రామంలోని సర్వే నంబర్ 144, 358లో ఉన్న గుట్టలో కొందరు టిప్పర్ల ద్వారా ఎర్ర మట్టిని తరలిస్తు రూ.లక్షలు అర్జిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని లేకపోతే తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వెంటనే జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి మట్టి తరలింపు నిలిపివేసి ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

కల్వర్టుకు మరమ్మతు చేయాలి



ధన్వాడ: మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మారుతినగర్ కాలనీ వద్ద సింపునోని కాలువపై ఉన్న కాల్వర్టు దెబ్బతిని ధన్వాడ నుంచి కంసాన్‌పల్లి, యంనోనిపల్లి, గున్ముక్ల, మాంత్రోనిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న కల్వర్టును బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ మంగళవారం పరిశీలించి ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధి కుంటు పడిందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ సాయిప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిడ్జింత ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి 30 ఏళ్ల తరువాత కలుకోవడంతో ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకొని చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే తమకు చదువు నేర్పిన గురువులు శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డి, గోవింద రెడ్డి, నారాయణ, అనంతరెడ్డిలను శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చన్నప్ప, బాల్‌రెడ్డి, గాయత్రి, ప్రమీల, యశోద, రవింద్రమ్మ, నారందమ్మ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టులు అగ్రవర్ణాలకేనా..?

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకి కట్టబెడుతున్నారని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడాతూ.. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగడం లేదని బీసీలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే నామినేటెడ్ పోస్టులను బీసీలతో భర్తీ చేసి చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమాచార కమిషనర్ నియామకాల్లో సామాజిక న్యాయం పూర్తిగా కొరవడిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 10 సమాచార కమిషనర్ పదవులో ఇప్పటి వరకు ఏడు భర్తీ చేయగా అందులో ఒక్కటి కూడా బీసీలకు కేటాయించలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ద్వారా బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీలు అమలు కావడం లేదని విమర్శించారు.

స్వీయరక్షణకు కరాటే నేర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ స్కూల్‌లో ఆర్‌కే కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, మాస్టర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ విజయ్‌కుమార్, ప్రశాంత్, సీనియర్ విద్యార్థులు నిఖిల్, రోహిత్, వర్షిణి, విఘ్నేష్, భరత్, విశాల్, సాయిసృజన పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపు

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోట మైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రిదాక నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, బాలల హక్కుల పరిరక్షణ చైర్‌పర్సన్ సీతదయాకర్‌రెడ్డి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యావాహచనం, ఆచార్యదిరుత్విక్‌వరుణ, పంచగవ్యమేళన, ప్రాశన, ప్రోక్షన యాగశాల ప్రవేశం, ప్రధాన దేవత, నవగ్రహ వాస్తు భద్ర మండలదేవత ఆరాధన, మంత్రమూర్తి అభిశేఖము, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

పర్థీపూర్ చెరువుకు జూరాల నీళ్లు



జిన్నారం దగర పర్థీపూర్ చెరువులోకి చేరుతున్న జూరాల నీళ్లు

మరికల్: చిన్నచింతకుంట మండల ఉంద్యాల స్టేజీ 1 పంపుహౌస్ దగర నీటిని విడుదల చేయడంతో మంగళవారం పర్థీపూర్ పెద్ద చెరువుకు కృష్ణమ్మ నీళ్లు వచ్చి చేరాయి. రెండు రోజుల్లో చెరువు నిండిన తర్వాత అక్కడి నుంచి తీలేర్ పంపుహౌస్‌కు నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాలకు ఎగువ నుంచి ముందే వరద నీరు రావడంతో వాటిని కోయిల్‌సాగర్‌కు పంపింగ్ చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



గుండుమాల్‌లో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త శేఖర్

కోస్గి రూరల్: నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ శాస్త్రవేత్త శేఖర్ అన్నారు. మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమంపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలంలో భాగంగా (వరి , కంది , జొన్న) మూడు పంటలకు సంబంధించి 33 మంది రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాలు నాటినప్పటి నుంచి కోత కోసే వరకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను మార్కెట్లో విక్రయించవద్దని పంటలు పండించే రైతులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు.

వరి, జొన్న, కంది విత్తనాల పంపిణీ

మరికల్: రైతులు కల్తీ విత్తనాల బారిన పడకుండా ఉండేందుకు ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేస్తున్నట్లు ఏఓ రహ్మాన్, విండో చైర్మన్ వెంకట్రామారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి ఇద్దరి చొప్పున రైతులను ఎంపిక చేసి వరి, కంది, జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.



రైతులకు విత్తనాలను అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం

కొత్తపల్లి: మండల పరిధిలోని లింగాల్ చేడ్ రైతు వేదికలో మంగళవారం నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, జొన్న, కంది మూడు పంటల కిట్స్ బస్తాల విత్తనాలను రైతులకు అందజేశారు. నేల స్వభావాన్ని బట్టి పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు.

నాణ్యమైన విత్తనంపై అవగాహన

కృష్ణా: రైతులు నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్త ఈశ్వర్‌రెడ్డి , మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్‌లు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా మండల అభ్యుదయ రైతులకు వరి, కంది విత్తనాలను ఉచితంగా అందించారు.

10 శాతం అధిక దిగుబడి సాధ్యం

మాగనూర్: నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి వస్తుందని మండల ఏఓ సుదర్శన్ గౌడ్ అన్నారు. 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి శాస్త్రవేత్త పాల మాట్లాడుతూ పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబడులు కనీసం 10-15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. అధునాతన సాంకేతికతను పాటిస్తే అదే విత్తనాన్ని 2-3 ఏళ్ల వరకు వాడుకోవచ్చని తెలిపారు.

దామరగిద్ద: నాణ్యమైన విత్తనాల సాగుతోనే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి మణిచందర్, విండో అధ్యక్షుడు ఈదప్పలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు వేదికలో విత్తనాల పంపిణీ చేసి రైతులకు పలు సూచనలు చేశారు.

ధన్వాడ వాసికి జాగృతి కవితా పురస్కారం



అవార్డు అందుకుంటున్న మొల్కమోళ్ల బాలకృష్ణగౌడ్

ధన్వాడ: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హదరాబాద్‌లో నిర్వహించిన యువ కెరటాలు-యువ కవుల సమ్మేళనంలో ధన్వాడ గ్రామానికి చెందిన మొల్కమోళ్ల బాలకృష్ణగౌడ్ తెలంగాణ జాగృతి కవితా పురస్కారం అందుకున్నాడు. తెలంగాణలోని అన్ని జిల్లాలో ఎంపిక కాబడిన ప్రతిభవంతులైన యువకవులు పాల్గొని తమ కవితా గానాన్ని ఆలపించారు. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోవాలి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ భాస్కరస్వామి

మరికల్: భూములకు సంబంధించిన సమస్యలను భూ భారతితో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రాంకోటి అన్నారు. మండలంలోని వెంకటాపూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌లో, డీఎస్‌లో, విరసతు, తదితర భూ సమస్యలు ఉంటే సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి, విజయ్‌కుమార్, మురళి, విజయ్‌రెడ్డి, రవి, శివకుమార్ పాల్గొన్నారు.

జూన్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

మాగనూర్: అన్నదాతలు భూ సమస్యల పరిష్కరానికి 'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోవాలని మాగనూర్ తహసీల్దార్ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం మాగనూర్ మండలం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జూన్ 3 నుంచి జూన్ 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. భూ సమస్యలు ఉంటే సంబంధిత ఫారం నింపి అధికారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, ఏంఆర్‌ఐ బలరాజ్, ఆర్‌ఐ శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామపెద్దులు, రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ నాగలక్ష్మి

12 అర్జీల స్వీకరణ

కోస్గి రూరల్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని గుండుమాల్ మండల తహసీల్దార్ భాస్కరస్వామి అన్నారు. మంగళవారం గుండుమాల్ మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామ పంచాయతీలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 12 మంది రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్రాములు , జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వినతిపత్రాల అందజేత

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం భూ భరతి రెవెన్యూ సదస్సును నిర్వమించారు. గ్రామ పంచాయతీ కార్యలయంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు రైతులు వినతి పత్రాలు అందజేశారు. సదస్సులో మండల తహసీల్దార్ సింధూజ పాల్గొని వినతులను స్వీకరించారు. సమస్యలను భూ భరతి చట్టం ద్వారా పరిష్కరిస్తామని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శితో పాటు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు ప్రారంభం

ఊట్కూరు: భూభారతి పథకంలో భాగంగా ఊట్కూరు మండలంలో మంగళవారం తహసీల్దార్ చింతరవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. మల్లెపల్లి, రేవెల్లి గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి సదస్సులను నిర్వహించారు. పలువురు రైతులు వారసత్వం, భాగపరిష్కారాలు, సాదాబైనామ, అసైండ్ భూములు తదితర సమస్యలతో కూడిన ధరఖాస్తులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణారెడ్డి, వెంకటేష్, విజయభాస్కర్‌రెడ్డి, రేణుక పాల్గొన్నారు.

కొత్తపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని లింగాల్ చేడ్ గ్రామ పంచాయతీలో 4,పెద్దాపూర్‌లో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులో దరఖాస్తు చేసుకుంటే భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ శ్రావణ్ కుమార్, నర్సింములు,మహేశ్,అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.